# తొలిరాకులు

ఉమ



# తేలిరాకులు

ఉమ ఇయ్యుణ్ణి

# తెలిరాకులు

రచన: **ఉమ ఇయ్యుణ్ణి**

© All rights reserved by the author
written permission through the email is required for
public usage of any of the lyrics either in part or full.

చిరునామా:

**Dr. Uma Eyyunni**
P.O. Box 860007
St. Augustine,
FLORIDA 320 86.
U.S.A.

www.pranavamusic.com
email: eyyunni@yahoo.com

**Price: ₹ 50/-**
**$ 5**

Cover Design:
Srinivas
Visual Graphics
Chickadpally, Hyderabad.

D.T.P.:
**V. Asha Rani**
Musheerabad, Hyderabad.
Ph: 868 664 5226.

Printed at:
**Kala Jyothi Proces Limited**
1-1-60/5, R.T.C. Cross Roads,
Musheerabad, Hyderabad-20.
Ph: 040-27612337, 27612346.

# మొదటి చిగురు

సేహ్నానుబంధాలకు, చెలిమి సుగంధాలకు భౌతికమైన హద్దులు అడ్డు రావని మరొక్కసారి నిరూపించారు స్నేహితులు, శ్రీయుతులు యల్లాప్రగడ రామకృష్ణారావు మరియు చక్రపాణి, శేషగిరి రావుగార్లు. దైనందిన జీవితపు బాధ్యతల్లో మునిగి ఉన్నా కూడా రెండు మూడు సంవత్సరాలకోసారి నేను 'గాలిపల్లకి'లో పంపే 'తుహినకణాల'ను 'శ్రీకరముల స్వాతి ముత్యాలు'గా మెరిపించి, స్నేహపు 'తలిరాకుల'ను పల్లవింపజేసే చిన్ననాటి స్నేహితులందరికీ ఏ విధంగా కృతజ్ఞతలందీయను!

విదేశాల్లో ఉన్నా కూడా ప్రత్యేకంగా నా కోసం వచ్చి ఇక్కడున్న చిన్ననాటి స్నేహితురాండ్రు, గురువులతో కలసి ఆశీర్వదించి, అభినందించే చెలిమికి నిర్వచనమేమివ్వను? నేను పొందుపరుచుకునే భావవీచికలను మలయ సమీరంలా భావించి జీవన సహచరి ప్రోత్సహిస్తుంటే 'ఈ' తలిరాకులు వసివాడకుండా పుట్టింటివారు, మెట్టింటివారు వాత్సల్యపు నీడలు పరచగా, చిరంజీవులు శ్రీకర స్వాతి ముత్యాలుగా మెరిసిపోయే భావనా స్రవంతిని అమృత ధారగా, చిద్విలాసంగా ప్రవహింపజేస్తున్న భాషా సరస్వతికి అక్షర సుమాంజలి!

- ఉమ

# ఆచార్య తిరుమల స్మృతికి

"కవిత పేరు మానవత" మా వక్తృత్వ సాహిత్య కళా సమితి వారు ప్రచురించగా ముందుమాట వ్రాసి మాకు కవితా ప్రపంచం ద్వారాలు తెరిచిన శ్రీ ఆచార్య తిరుమల భౌతికంగా ఇక లేరు అని తెలిసింది.

దాదాపు 30 సంవత్సరాల తర్వాత నా కవితా సంకలనాలు 'తుహినకణాలు', 'గాలిపల్లకి' ఆవిష్కరణ సభలలో అధ్యక్ష స్థానంలో నన్ను ఆశీర్వదించిన శ్రీ తిరుమలగారికి ప్రస్తుతం అక్షర సుమాంజలి సమర్పించడమే మిగిలినది అని మనసు బాధపడుతున్నా ఆయన ఆత్మ నన్ను ఆశీర్వదిస్తున్నట్లే ఉంది.

తుహిన కణాలలోని ఆర్ద్రతను, గాలిపల్లకిలోని ఆధ్యాత్మికతను, అందమైన అక్షరాల్లో విశదీకరించి, సభాధ్యక్షత వహించిన ఆచార్య తిరుమల గారు నాకు సర్వదా పూజనీయులు.

వారికిదే శ్రద్ధాంజలి!!

- ఉమ

# తలిరాకులు

జీవన సారాంశాన్ని 'తలిరాకు'తో పోలుస్తూ ఓ తాత్వికతను వెలువరించిన కవయిత్రి ఉమ. మొగలిపాయలు, పొగడపూలు, వెన్నెల వాగులు, మల్లెపూల మాలలతో మొదలైన కవితాగానం మెల్లగా ఈ భౌతిక పరిధులు దాటి అరయని, దూరపు దారులు, కలసిన సాంధులు, కలియని బాటల్లోకి పోయి 'వెలుగు నీడలు జీవన రీతులు' అన్న స్పృహతో ముగుస్తుంది.

తుహిన కణాలు, గాలిపల్లకి, ఇపుడు తలిరాకులు - ఈ మూడు కవితా సంకలనాల ద్వారా నిరంతరం తాను చేస్తున్న కృషిని అనేక వేల మైళ్ళ నుండి తెలుగు పాఠకులకు తెలిపారు - ఉమ. ఇంతకు ముందు కవితా సంకలనాలలోని సంభ్రమాన్విత భావ వర్ణ చిత్రాలను వెతుకుతున్న దశలో 'ఉత్తుంగ ఉదధిబోలి, విజృంభ ప్రభంజనా సరళికేగి... మధ్యాహ్న భానుడు మంకెన్న పూఛాయ, అపరాహ్నపు టపర్ణ కుంకుమల తలపోయ నటియించె అలివేణి అరుణిమల ఛాయ అని మరొకసారి గంభీరమైన శబ్దాలతో తన శైలిని చాటుకున్నారు (గిరికన్య).

పాదపూజ అనే కవితలో 'మందహాసము మెరయు మందార మొగ్గలు, మంచు తడిసిన చిన్నారి మల్లెలు, కన్నులరమోడ్చు సన్నజాజులు చేరి, పూజలందీయ చిదిమివేయుట ఏమి?' అని సృష్టికర్తలోని కరుణారాహిత్యాన్ని వాచ్యంగా ప్రశ్నిస్తున్నారు.

మూడున్నర దశాబ్దాల పరిచయం ఉమతో నాకు. తెలుగులోను, ఆంగ్లంలోనూ చాలా కృషి చేసిన వ్యక్తి ఈ కవయిత్రి. రచనల్లోనేకాక జీవితంలో కూడా మంచిని ప్రోత్సహించి సామాజిక స్పృహతో ముందుకు సాగే వ్యక్తిత్వం - ఈ డాక్టర్‌ది. తన వేదనలో కూడా ఇతరులకు వెలుగు చూపాలనే తాపత్రయం ఉమది.

ఈ కృషి నిరంతరం సాగాలని ఆశిస్తూ....

**- డి. చక్రపాణి**

# మరో వసంతం

దశాబ్దాల క్రితమే అమెరికాలో స్థిరపడి వైద్య వృత్తిలో క్షణం తీరిక లేని జీవితం గడుపుతూ కూడా సమాజ సేవకు, సాహితీ వ్యవసాయానికి కాలాన్ని పొదుపుగా వినియోగించుకుంటున్న పదహారణాల తెలుగింటి ఆడపడుచు డా. ఉమ.

ఉమ తొలి కావ్యం 'తుహిన కణాలు' తుహినమంటే మంచు. ఈ తుహినకణాలు హేమంత శిశిరాలను సంకేతిస్తాయి. ఇప్పటి ఈ కావ్యం 'తలిరాకులు' తలిరాకులంటే చిగురాకులే. అంటే, శైశిర జడత్వం నుంచి తలిరాకుల వసంతానికి ఉమ 'గాలిపల్లకి'లో పయనించి చేరుకున్నది. ప్రేమ, స్నేహం, సౌందర్య దిదృక్ష - ఇవే ఈ కావ్యనందనంలో పల్లవించిన తలిరాకులు. నైరాశ్య భావాల పండుటాకులు ఈ తోటలో లేవు. భౌతికంలోకంటే, భావనా లోకమే తన పరమావధి అంటూ ఉమ తన హృదయాన్ని ఆవిష్కరించుకొన్న వైనం ఈ కావ్యంలోని అంతఃసూత్రం.

కవిత్వం కాలానుగుణమైనదైతే కావచ్చుగానీ, ప్రధానంగా హృదయానుగుణమైనది. వర్తమాన కవితా ప్రపంచంలోని వివిధ 'ఇజా'ల బెదిరింపులకు తల వంచక, తన లాలిత్యమే స్పందనగా భావచిత్రాలను రూపొందించింది ఉమ ఈ కావ్యంలో. నాకు తెలుసు - చల్లని గాలి వీస్తే జలజలా వర్షించే వలాహక హృదయం ఈ కవయిత్రిది.

పరాయి గడ్డ మీద ఉన్నా ఈ నేల తల్లి మట్టి వాసనను హృదయంలో నిక్షిప్తం చేసుకున్న ఈ తెలుగు తల్లిని అభినందిస్తున్నాను.

**వై. రామకృష్ణారావు**

హైదరాబాదు

# మమతల శిఖరం

ఉమది విశేషమైన శైలి. సొంత గొంతు. ఆర్ద్రత, అభిమానం, అనురాగం అంతర్లీనంగా నిరంతరం సాగే భావ ప్రవాహం.

*అరయని గమ్యపు దూరపు దారులు*
*తెలియని త్రోవల అడుగిడు తీరులు*
*కలసిన పాంథులు, కలయున బాటలు*
*నీటను వ్రాసిన నిలువని బాసలు*

జీవన వ్యాకరణంలో సంక్లిష్టమైన సూత్రాలు ఉమ కలంలో అలవోకగా జాలువారటం 'బ్రతుకు కథ'లో గమనించవచ్చు.

*భవనాలు నాకేల భవహరా తెలుపు*
*భావ హర్మ్యాలు నిర్మించి అలరించినావు*
*బంధుమిత్రుల నాకేల బుధజనపాల*
*భావబంధాలు చాలయ్య బ్రతుకులోన*

భవబంధాలతో సాధించిన అపారమైన అనుభవంతో తన బ్రతుకు బాటలో ఏది అంతిమ లక్ష్యమో గుర్తించి, దాన్ని విస్పష్టంగా వ్యక్తీకరించడం 'నివేదన'లో ధ్వనించిన వేదన. అన్ని సందర్భాలలో స్పందించే మానవతావాదం, ఉన్నత విలువలని వినమ్రంగా అంగీకరించే తత్వం ప్రకృతిపైన మక్కువ, పరమాత్మ ఉనికిని మరువలేని నైజం కలగొలుపుగా సాగే ఆలోచనా తరంగాలు ప్రతి కవితలోనూ సాక్షాత్కరిస్తాయి. పెంచుకున్న మంచితనాన్ని పదిమందితో పంచుకుందామనే తపనతో ఉమ సాగించే సారస్వత జైత్రయాత్రలో కమ్మటి తెలుగుదనం అన్ని వేళల్లో పరిమళిస్తుంది. భావ కవిత్వ ఛాయతో సాగే కవితలతోపాటు, కూర్చిన సంకీర్తనల సంకలనం. తలిరాకులకు సంగీత మాధుర్యాన్ని సంతరించిందనేది వాస్తవం. ఈ కావ్యాన్ని ఆసాంతం స్వాంతగతం చేసుకుంటే ఈ వాస్తవం మన అనుభవంలోకి వస్తుంది.

**పి. శేషగిరిరావు**

హైదరాబాదు

# విషయసూచిక


1. ఆర్ద్ర స్వప్నం ........................................ 1
2. ఊహల సేసలు .................................. 2
3. వలపు కానుకలు ................................ 3
4. మోహనం ........................................ 4
5. జీవన నిశీధి ..................................... 5
6. నివేదన ........................................... 6
7. గిరులు దిగి రావయ్య ........................ 7
8. అర్పణ ............................................. 8
9. అక్షరాక్షతలు ..................................... 9
10. సుప్తశోకం ........................................ 10
11. బ్రతుకు కథ ........................................ 11
12. భావబంధం ..................................... 12
13. ఆశ .................................................. 13
14. వెన్నెల సొన ..................................... 14
15. తెలుగింటి జ్యోతులు .......................... 15
16. నేడు ................................................ 16
17. లీల .................................................. 17
18. ఆకలి ............................................... 18
19. త్వమేవా-హం ................................... 19
20. ఆషాఢం .......................................... 20
21. మన స్నేహం ..................................... 21
22. జలధి సన్నిధి .................................... 22

23. బాష్పార్చన ........................................ 23
24. మనసు సరిగమలు ........................... 24
25. నిరీక్షణ ............................................ 25
26. ఎవరివో...! ....................................... 26
27. ఎద సొదలు..... ................................ 27
28. కూచిపూడి కళలు... ........................... 28
29. వెంపటి చిన సత్యం ........................... 29
30. శివ స్తుతి .......................................... 30
31. గిరి కన్య ........................................... 32
32. కైవల్యం ............................................ 36
33. పాదపూజ ........................................ 37
34. కమలము ......................................... 38
35. మయూరము .................................... 39
36. విధి లీల! .......................................... 40
37. రాజీ స్మృతికి ...................................... 41
38. గేయ కథ .......................................... 43
39. సంకీర్తనలు ...................................... 45

# ఆర్ద్ర స్వప్నం

మోడువారిన బీడులవి
చివురు మొలకల వెలువరించె
కరడు గట్టిన హిమసమూహము
కరగి వాగుగ పరవశించె
ఆర్ద్ర తెరుగని హృదిని నేడు
అశ్రుకణము పలుకరించె
'నిన్న' మరచిన నిన్ను తలచి
కనులు సుధలను చిలుకరించె
కలల వూసులు, ఇలల బాసలు
కలసి నెచ్చెలి, నిను పలకరించె.

# ఊహల సేసలు

వెన్నెల వాగుల దాగెడు వలపు గాథలు
కన్నుల బాసల సాగెడు తలపు తోవలు
వెన్నుని ఊసుల ఊగెడు చెలిమి డోలలు
సన్నని గాలుల వీచెడు సుధల సోనలు

మూసిన రెప్పల మాటున గీసిన రేఖలు
వ్రాసిన చిత్రపు చాటున దాచిన లేఖలు
నీకని ఏరిన మల్లెల పూవుల మాలలు
నెచ్చెలి, చేకొని నేనిడు ఊహల సేసలు!

# వలపు కానుకలు

చిగురుటాకులు చిలికె చిరుత నగవులు
మొగలిపాయల నడుమ సొగసు బిగువులు
పొగడ పూవుల నొదుగు మధుర భావము
చెలుడ నీ మోవి మెరయు లలిత రాగము

గగన వీధుల కదల ప్రణయ డోలికలు
మనసు ఊగెడు మమతల మొయిలు మాలికలు
చెలియ నీకిడు చెలిమి కలల వీచికలు
నెచ్చెలి చేకొను మిపుడే వలపు కానుకలు!

# మోహనం

కుముదిని కనులను వెలిగేను కౌముది
విరిసిన రేకుల మెరిసెను మృదుహృది
వెదకెడు సఖుడటు మొయిలున దాగి
అరసిన కురిసెను ప్రణయపు సుధలవి!

పున్నమి రేలవి జన్మల ఫలములు
వెన్నెల పూలవి వెన్నుని నగవులు
గోపిక వలపులు యమునలో తరగలు
రాధిక మమతలు మురళిలో రవళులు

మాధవ లీలలు మోహన గీతులు
వెలుగు నీడలు జీవన రీతులు
తరచగ మనుజుని హృదయపు లోతులు
వెలుగును పరిపరి వన్నెల జ్యోతలు!

# జీవన నిశీథి

మొయిలు భామల నీలి కుంతలముల చిక్కువడి
మల్లెలా యన మెరసేన ఈ రేయి చంద్రికలు
నెచ్చెలి విరహాన జాలువారు కన్నీటి ధారలు
కాబోవు గగనాల వెలిగేటి తారకలు!

పున్నమలు గడిచేను పున్నెములు సమసేను
కన్నులవి వెన్నెలల మాలలుగ మారేను
అధరాల సుధలన్ని వ్యధలుగ వాడేను
నెచ్చెలి తలపుల వసివాడిపోయేను

వడగాలి వీచేన ఈ వసంత మాసాన
తలిరాకు వాడేన తరుల ఛాయలలోన
విడబోవు పసిమొగ్గ రేకు రాలేన
ఈ ఎడద భారాన కవిత నలిగేన!!

# నివేదన

కోరలేదు నేనెపుడు కానుకలు నీనుండి
కనుచూపె చాలంటి కమల నయన
చీని చీనాంబరములు నేనడుగలేదు
చిరునగవె మెరుగంటి చిద్విలాస

ఆణిముత్యపు సరాలు నాకేల అచ్యుత
ఆనంద భాష్పాలు అవె నాకు అందాలు
కరములరమోడ్చి ఓ కరుణా స్వరూపా
కోరుచుంటిని నీదు పదకములముల నేడు.

భవనాలు నాకేల భవాహర తెలుపు
భావ హర్మ్యాలు నిర్మించి అలరించినావు
బంధుమిత్రులు నాకేల బుధజనపాల
భావబంధాలు చాలయ్య బ్రతుకులోన.

నెగడు వెన్నెలల వెలుగులు నాకేల
నెచ్చెలి నెమ్మోము నా మదిని నిలువ
ప్రణవ నాదాలు నా పరిధిలో లేవు
ప్రణయ గీతమ్మొకటె నా బ్రతుకు బాట

చిరుత నగవులొలుక చిన్ని పూవును నేను
తొలి సంధ్య వికసించి మలిసంధ్య వడిలెదను
విరిసి నీ పాదాల మురిసి పోనీవయ్య
నెచ్చెలి నగవుల్లో కలసి పోనీవయ్యా!!

# గిరులు దిగి రావయ్యా

మరుని తూపుల నిను బంధించె మగువ
గిరుల దిగి రావయ్యా మదనజనక
మంగమ్మ పాదాలు మందార మొగ్గలు
మకరందము చిలికించు మధుసూదన!

కలికి కరకంకణములు కదిలింప గలగలలు
నెలత నునుమోవి చిలికింప మధురిమలు
పడతి పదమందు పలుకాడె స్వరఝరులు
లలన కదలికల కుసుమించె తరులతలు.

# అర్పణ

కనురెప్ప తెప్పలో కలల కడలి చేర
కదల బూనితి నేను కారుణ్యమూర్తి

ఇప్ప పూదోనెలో ఒప్పగు సొబగులు
విప్పి నీకందివ్వ వేచితి మధురమూర్తి

తప్పువొప్పులు లేని తరుణ హృదయమందించి
అర్పితము నేనైతి అమరమూర్తి

రెప్పపాటున కనుమరుగైతివేమొ కాని
విప్పలేని ఈ బంధమెటుల విడదీతువోయి?

# అక్షరాక్షతలు

అతులిత మాధుర్య మొసగి ఇటులను
అలరుల దోనెలు విరియగ తడవేల?
కనులను దాగిన కలలను చెరపగ
కఠినము కాదయ్యా నీమది ఈ వేళ?

నమ్మితి నినుమది నమ్మితి నెపుడును
కరుణతో ఏలెడి విభుడవు నీవని
నాదను అహమును నీ కిడి నిలచితి
నేడిటు వంటరి బ్రతుకున వేగితి.

కనరాదు వెలుగది కన్నీటి మసకను
విడలేను మమతలు విడలేను బంధాలు
అశ్రువులే అక్షరముల అక్షతలుగ రాలేను
నెచ్చెలిగ తలచి నిను నేనయితి సర్పణము.

# సుప్తశోకం

మొయిలు దారుల దాగును మెరుపు
తిమిర ద్వారము తెరచిన వెలుగు
శిశిరపు మోడుల వెనుకనె ఆమని
వెలుగు నీడల కలయిక ప్రకృతి

బ్రతుకు బాటల దాగును శోకము
వెదుకు పాంథుడు చేరును గమ్యము
విడకు ఆశలు విడకు యత్నము
అని పలుకు వేదాంత సారము

వినదేల ఈ మది వేదల భాష్యము?
కనలేను దాగున్న జీవిత సత్యము
కనుల జారేడు ముత్యపు సరాలు
చేర్చి నెచ్చెలి పాదాల రాలన!

# బ్రతుకు కథ

ముసిరెడు చీకటి చెరగుల నీడలు
పరచిన పుడమి విరిసెడు జాడలు
వెదకెడు చూపులు కనుగొను వెలుగులు
పిడికిటి హృదయపు లోతుల నగవులు.

అరయని గమ్యపు దూరపు దారులు
తెలియని త్రోవల అడుగిడు తీరులు
కలసిన పాంథులు, కలయున బాటలు?
నీటను వ్రాసిన నిలువని బాసలు.

బ్రతుకుల కలయిక ప్రకృతి వేడుక
మనసుల కూడిక విధాత కానుక
తెలిసిన నిజమిది, తెలియని విధియిది
నెచ్చెలి, వినుమిది, మనుజుల కథ యిది!

# భావబంధం

వెలువరించగ వెతల గాథలు
వెల్లువాయెను కనుల ధారలు
వెలికి రానివి ఎదల సొదలు
తెలుపజాలని మధుర కథలు

భావమన్నది బంధమాయెను
రాగమన్నది ఖేదమాయెను
మమత నేడది మరుగుపడగ
మనికి చీకటి చెరగు దాగెను.

# ఆశ

మినుకు మినుకు మనెడి ఆశ
మునికి నిలుపువేళ
కునుకు పడితె నీవు
కనుమరుగు కాబోకు
చినుకు రాలిన యటుల
సడిసేయని కన్నీరు
తొణికి జారినవేళ
నను విడిచి పోకు!

చిగురుటాకు చివర ఊగిసలాడేను
చిరుగాలి సోకిన రాలి సమసేను
లిప్తకాలపు టునికి లోన
అనంతాను భూతుల యలజడి రేగేను.

కనురెప్ప కదలికన కదలి జారిన బిందువు
కాబోన కలల కడలి నేడు
అణువంత వెలిగిన అంతరంగపుటాశ
వెలిగింప బోన గుమిగూడు తిమిరాల?

# వెన్నెల సొన

వెండి కరిగి వాగులయి నటుల
పండు వెన్నెల జాలువారగ
కన్నె రాధిక వలపు దోచిన
వెన్న దొంగ ఎక్కడమ్మా

మిన్నులన్నీ వెన్నెలాయెను
వన్నెలన్నీ కన్నెలాయెను
పున్నమేమొ పున్నెమాయెను
వెన్నుడేమొ కానడాయెను

# తెలుగింటి జ్యోతులు

తిమిరాలు చెదరగ వెలిగేను దివ్వెలు
హృదయాల ముదములు నిలిపేను నవ్వులు
స్నేహాల నందింప కలిసేను మనసులు
తాపాల తొలగింపు మురిసేను జగములు

అమవస నిశిలోన అలరేను అందాలు
సుజ్ఞాన దీపాలు పంచేను వెలుగులు
సహృదయ భావాలు రేపేను సంస్కృతులు
తెలుగింట వెలిగేను రేపటి జ్యోతులు

# నేడు

మనిషి మనుగడ కాద స్వప్నంపు ఛాయ
విరుల బ్రతుకు కూడ నిముషమే కాద
విరిసి రాలిపోవ సమసిపోవు నస్తిత్వము
రేయి గడిచిపోవ కరగిపోవు స్వప్నము

ధూళి కలసిన చినుకు పంచిన సుగంధము
పృథివి రచించిన మధుర ప్రబంధము
క్షణము గడచిన వేళ మిగిలిన నిజమేది
శాశ్వతముగ నిలచు క్షణమది ఏది?

ఉదయ సంధ్యలోని మెరుపులు కలబోయ
ఉభయ సంధ్యల నడుమ ఉనికి నీది
గతము గడిచిపోవ, భావి స్వప్నము కాద
'నేడు' నిజమని నమ్మి నిజములో నిలిచేన!

(మూలం సోదరి వెంకటరమణ ఆంగ్ల కవిత 'Now')

# లీల

ఈ చిన్ని బాలుని చిరునవ్వులోన
ఏ తేనె మాధురుల రంగరించేవు
ఆ కంటి తళుకుల మెరుపులోన
ఏ గగన తారల హొయలు దాచేవు
ఆ నును చెక్కుటద్దాల వెలుగులో
ఏ సముబాల సౌకుమార్యమద్దేవు
సృష్టి చేసిన జగత్స్రష్ట నీవు
ఏ జన్మ పుణ్యాల పసిపాప నొసగేవు?

కారణమేమని నేను ప్రశ్నించబోను
కలవు లేవో నీవని కలత చెందబోను
కనుపించని ఓ కారుణ్యామూర్తీ
నీ కరుణ నా మమత మూర్తియై నిలచేను.

(మూలం సోదరి వెంకటరమణ ఆంగ్ల కవిత 'God's little Secret')

# ఆకలి

గుప్పిట ప్రాణముంచి, గుప్పెడు మెతుకులకు ఏడ్చి
దప్పిక తీరని కన్నీళ్ల కడవల నింపి
కనుచూపు దూరాన, కరుణ కనపడనిచోట
కనుమరుగు కానున్న బ్రతుకులెన్నెన్నో!

కారణమేమయ్య కారుణ్యమూర్తి
ఆలయనాదాల ఆక్రోశములణగేన
పుష్కరిణి జలాల అశువులు కలసేన
అష్టోత్తరములలో ఆక్రందన వినలేవ
మంగళాష్టకమున మనికి మాసేన
భిక్షకులమయ్య ముంగిట నిలచేము
అక్షయ లక్షలడుగ లేదు కదయ్యా
క్షోణితలమ్మున ఈ క్షోభ ఏమి
క్షుద్బాధ రగిలిన పసి నిసుగుల గతి ఏమి?

పదాల పొందికన బ్రతుకు నడిచేన
కవితల కన్నీళ్ల కడుపు నిండేన
కరకు రాతిగుండెల కరిగింపలేవ
కలిసి నీలో చేర ఆనతియగ లేవ!

(సోమాలియాలోని అన్నార్తుల చిత్రం చూశాక కలిగిన క్షోభ)

# త్వమేవాఽహం

వేయి రేకులు విరిసిన సరసిజమున
మాధుర్య మందించు తేనెగాన
అళిరాజు పెదవంటి అలరుల కందేటి
హృదయాన దాగున్న పరాగముకాన

మొయిలు మదిన ఒదిగి పయనించి
మలయ పవనుడు పిలువ
రాలు చిన్ని చినుకుగాన
కనురెప్ప మలుపున కదలాడు మమతవై
నీ పదము తాకంగ కన్నీరునేగాన
బ్రతుకంత వేచేనె, ప్రతిపథము వెదికేను
అణువణువు దివ్వెగ తనువంత వెలిగేను
కటిక చీకటి రేయి, ఒక మెరుపు తళుకులో
నాలోనే దాగున్న నిన్ను కలిసేను

# ఆషాఢం

ఆషాఢం వచ్చేనదిగో
ఆకాశం పలికేనదిగో
ఆ మబ్బు కురిసి కురిసి
ఆ నేల తడిసి మురిసి

సెంగావి సీర కట్టి
రంగారు రైకే ఏసి
సింతాలు వచ్చే ఏల
సద్దెన్నం తెచ్చే ఏల

పైరులన్నీ పైపూకొస్తే
కోతలన్నీ రాసులు పోస్తే
రైతన్నలే రాజులు కార
జాతులన్నవే మరచిపోరా!!

# మన స్నేహం

ఒక పూవు పూచింది విరితోటలోన
చిరుగాలి వీచింది కెరటాలపైన
ఒక పాట మెదిలింది చిరు తేటి మదిన
నునుమోవి పలికింది చిరునగవుతోన

మా ఇంట వెలసేను పగడాల రాశి
మా కంట వెలిగేను స్వప్నాల జ్యోతి
మా యింటి దీపాల వెలుగుల లోన
రాచింటి కళలన్ని మెరిసేను కాద

కలత చెందిన వేళ కన్నీరు తుడిచి
మమత పొంగినవేళ మన్నించి,నిలచి
మనసు తెలిసిన మంచి నేస్తమై తోచి
మనికి నిలిపిన స్నేహమే కదా మనది!

# జలధి సన్నిధి

గుండె లోతుల కదలాడు మమతలు
నిండు కలశము నందు తొణకని మధువులు
మండుటెడద కవి కురియు మంచుబిందువులు
ఎండుటాకుల నడుమ పులకించు పసిపల్లవములు

బ్రతుకు బాటను బడలి సాగువేళ
చెలిమి నీదికాద నాకు చేయూత
అలసి నిదురించువేళ సేదతీరగ సేయు
నీడ నాకు రాద నీ కలల చెంత

కడలి ఎదను రేగు అలల పగిది
ఎడద ఒదిగెనోయి మమత నీది
ఇసుక తిన్నెల తాకి పలుకరించు జలధి
మసక కన్నుల నీరు తుడిచె నీ సన్నిధి

# బాష్పార్చన

ఆలయ ద్వారముల కనులరమోడ్చి నిలిచి
అశ్రుధారల నీ పదముల నర్చించ వేచి
అమృతపు మమతల నభిషేకించ తలచి
పసి నిసుగుల కన్న అమ్మలమయ్యె
నీ విధి లీలల యాడు బొమ్మలయ్యె

కరుణ నెచట దాచి కలతల పంచేవు
కరుణాల వాలుడ వని బిరుదుగాంచేవు
కలిమిలేముల అలజడి కావయ్య మాది
కంటిపాపల కాపాడు తపన మాది....

# మనసు సరిగమలు

సడి లేని నడిరేయి సెలయేటి గలగలలు
వడివడిగ పిలిచేను గత కాల స్మృతులు
తలిరాకు తల్పాల విడలేని విరులు
ఒదిగేటి చిరుతేటి ఊసుల గుసగుసలు

నడిచేము ఒడిదుడుకు దార్ల కొన్నాళ్ళు
అరసేము కోరిన గమ్యాల హరివిల్లు
చేయూత నందీయు స్నేహాల మమతలు
కలిగించె మనలోన కోరిన సమతలు.

కలలు దారుల విడచి కనుగొన్న సత్యాలు
కనురెప్ప కదలికల కదలాడు ముత్యాలు
చిననాటి స్నేహాలు చిందించు మధురిమలు
మనసు తంత్రుల మీట పలికేటి సరిగమలు

# నిరీక్షణ

విరిసేన కుసుమాలు వెదజల్ల గంధాలు
తెలిపేన నీ రాక మెరిసేటి తారకలు
అరసేన నీ దరిని వెదికేటి గమ్యాలు
పలికేన నీ కబురు పులకించు మేఘాలు

ముసిరేను తిమిరాలు నీ వేగ దూరాలు
తొలిగేన ఈ మదిని వేధించు బారాలు
తలపోసి తలపోసి విసిగేను రేబళ్లు
నీ రాక కోసమే విలపించె వెన్నెలలు.

తలపున దాగేటి కనుదోయి నేస్తమై
వలపులు చిలికేటి ప్రయాణాల రూపమై
మనసును తాకేటి మమతల రాగమై
మనికి చిగురింప, నన్నేలు ప్రాణమై

# ఎవరివో...!

మసక మసక వెలుగు వెనుక
ఉసురు మనెడి ఊసులెవరివో
విసురు గాలుల వెతల మోతకు
కసరుకొనెడు కథలు ఎవరివో!

చిగురుటాకులు చెదరిపోవగ
మిసిమి రేకులు వడలిపోవగ
పసిడి బాసలు సమసిపోవగ
ముసురు చీకటి నీడలెవరివో

శిశిర బాధలు తొలగిపోవ
మధుర గాథలు మరలిరావ!
మనసు మనసు కలసిపోవ
మమత మధువై కురిసిపోద!

# ఎద సొదలు.....

ఎద సొదలు కావ తుమ్మెద రొదలు
కదలుకనుల దాగు చెమ్మల కథలు
విధి విధుల నేగు కమ్మని కలలు
వ్యథ సదరు నాదు వమ్మగు సొదలు

చినుకు చినికి కరిగె మొయిలు
మినుకు మనెడు గగన దివ్వెలు
కలికి కలలు వెదికె నేడు
కనని విభుని చెలిమి తోడు.

రేయి గడచున? రేడు వలచున?
మావి చిగురుల మోవి పిలచున?
కోరి కొలిచెడు స్వామి తలచున
రాగ అహరుల భావ మెరుగున?

# కూచిపూడి కళలు...

అందియల రవములు ఘల్లుమని పిలిచేను
డెందములు ముదమున ఝల్లుమని పలికేను
అచ్చరలు దిగివచ్చి వేదికల నలరింపు
విచ్చేయండి సభలకు విశ్వ నర్తకులార!

సిద్ధేంద్రు స్వప్నము సత్యమై నిలిచేను
సిద్ధులు యక్షులు ప్రేక్షకులై కొలిచేను
కూచిపూడి కళలు జగముల వెలిగేను
చూచి దీవించ రండు మీకిదె స్వాగతము

(కూచిపూడి నర్తకి శ్రీమతి రత్నకుమార్ కోరికపై)

# వెంపటి చిన సత్యం

కళలకె కదలిక నేర్పిన ఘనుడట
మువ్వల రవళుల మేలపు గురుడట
అడుగుల సవ్వడి అవనికి హారతి
వెంపటి సత్యము జగతికి బహుమతి

కూచిపూడి నృత్యాలు ఇల నిలచు సత్యాలు
భామల కలాపాలు వేదికల కందాలు
చండాలిక పదజతులు హరుని విలాసాలు
శ్రీపద పారిజాతాలు భారతికే నివాళులు.

అంతులేని శిష్యకోటి అందించు ప్రణామాలు
కళామతల్లి వనాల పూచిన భక్తి ప్రసూనాలు
కూచిపూడి నాట్యమన్న, సిద్ధేంద్రుని దీవెనన్న
కలకాలము నిలిచిపోవు వెంపటి చినసత్యమన్న!

(పద్మభూషణ్ వెంపటి చినసత్యంగారి 75వ జన్మదిన సందర్భంగా)

# శివ స్తుతి

స్ఫటిక లింగాకృతిం, విస్ఫుట ఫాలనేత్రం
జటాజూట నిర్బంధ మందాకినీ సలిలం
విజృంభ తాండవ నిమగ్నం విస్తార తేజం
జటిల నృత్యారచిత విలాసం, అర్థనారీశ్వరం

శుంభ నిశుంభ నిర్జిత గిరిజా ప్రమోదం
శంభాసుర నివృత ధూర్జటీ ప్రతాపం
గంభీర భావార్పిత కవితా ప్రసూనం
మమ హృదయాంబుజ నివసిత మిళిందం

ఫాలలోచన నాట్యమాడగ
నీలగగనము నిలచి చూడద
శైలతనయ లాస్యఖేలన
నాట్యసుందరి హొయలుకాద

పరమశివుని జటలు విడగ
పదము పదము పృథివినంటగ
ప్రణవనాదము గగనమంతట
మెరసి పోవగ జగము ఆడద

గగన తారలు నేలజారగ
నయనధారలు మ్రోలరాలగ
కరగిపోయెను అహము సర్వము
కరుణవాహిని సాగిపోద

కదలి రమ్మిక నాగభూషణ
కరిగిపోయెను అహము సర్వము
కరుణవాహిని సాగిపోద

కదలి రమ్మిక నాగభూషణ
కరిగిపోయెను నాదుజీవము
కదలలేనిక లేదు సహనము
కలతబారెను నాదు హృదయము.

నిటల లోచన నటనమాడగ
నిఖిల లోకము చకితమాయెను
కనుల భాష్పపు ఝురులు పొంగెను
గళము గద్గద రుద్ధమాయెను

వెతల బడలిన మనము సొలసెను
సకల జగములు నిలిచి చూసెను
జతను కలపగ పదము సాగెను
పథము తెలియక అచటె ఆగెను.

తెలియలేనివి విధి విధానము
తెలుప జాలని పద సమూహము
కవిత కందని సొదలనూహ్యము
ఎద తాకెడు మృదుసమీరము

# గిరి కన్య

పదమెత్త ఎదలోన ప్రణవమ్ముమోగె
తరులన్ని తలలూచి విరులకురిపించె
అరుదెంచ గిరికన్య, అవని పులకించె
కనువిప్పు సిరులన్ని కదలి నర్తించె

బాల అందెల రవళి గుండె ఝల్లనగ
మంజుల ధ్వానముల మనసు రంజిలగ
లలిత పదముల మువ్వ ఘల్లు ఘల్లనగ
నటియించె త్రిపురాత్మ కనుల పండువగ

ఎద నుండి వెలువడెను నాదఝరులు
సొద తెలిపె అమరపురి రాగసిరులు
కదలాడ సరస్వతీ వీణగతులు
నటియించె నగసుతా పాద జతులు

పసిడి కిన్నెర మీట సంధ్య వెలుగులు
మిసిమి వన్నెలు చాట వింధ్య శిఖరులు
పయనమైన మేటి మార్తాండు పగిది
మెదలినది నా మది చాముండ నర్తకి!

ఉత్తుంగ తరంగ ఉదధి బోలి
విజృంభ ప్రభంజనా సరళిరేగి
విశృంఖ విస్తార విశ్వాలదాగె
ప్రచండ మండలా చండికాదేవి

మధ్యాహ్న భానుడు మంకెన్న పూఛాయ
అపరాహ్నపుటపర్ణ కుంకుమల తలపోయ
వినువీధి తిలకింప కెంపుల సంజాయ
నటియించె అలివేణి అరుణిమలఛాయ

రాగరంజిత గగనము తరుణి వదనము
సాగుచుండగ నటనయు భవుని సదనము
పాల కడలి మథనము పడతి
పదయుగము
నీలకంఠుని హృదయ మమృతమయము

చెలరేగు సతి పదముల
విలయతాండవము
ఇదియేమి జగతి నిట ప్రళయభావనము
కలదేల సఖి ఎదను కల్లోల కారణము
తలపోయ కనరాదు కాఠిన్య భావము

దైత్య సంతతి దిగ్భ్రమను చెంద
దిగ్దిగంతముల సంభ్రమలు నిండ
నటియించె మాతంగి దశదిశలు తిలకింప
నటియించె శాంకరి భవహరుడు పులకింప

తకతకిట తకతకిట తకతకిట ధిమ్మని
భువి అదర దివి బెదర నర్తించె భైరవి
మహిష మర్దన ఖేల త్రిపుర సంహారలీల
ప్రళయరుద్ర హేల, ప్రళయ తాండవ లీల

నొసటి కుంకుమ అర్క బింబమ్ము బోల
పసిడి చందపు పడతి పయనించె నేడు
వినువీధి విభ్రమతో వీక్షించుచుండ
కనుదోయి చిలికింప కటాక్ష భావము

చేరి రజతగిరి, కూడి తన పతిని
సేద తీరెను మాత హిమగిరి సంజాత
త్రిపుర సుందరి ఆమె త్రిగుణైక మూర్తి
భువన మోహిని ఆమె నిర్గుణాకృతి

కైలాస గిరి కదలి కరుణవాహినిగ
కరిగిపోయెడు నది ఏమి, కారణమేమి?
కాత్యాయని కనుల కారుణ్య భావనయె
కపర్దిని కలిసి నేడు జాలువారినదేమొ

'బాల' కిలకిలల ఆమని అరుదించె
త్రిపుర పదగతుల ప్రకృతి నటియించె
సుందరి కనుగవల గగనాలు వ్యాపించి
విశ్వ విపంచి మూర్ఛనలు పోయె!!

జనని నీవు కరుణ జలధినీవు
మధుర భావ జనిత మమత నీవు
మనుజ హృదయ శాంతి నెలవు నీవు
నిలచి నా కవిత వెలుగు జీవమీవు

నాట్యాల, లాస్యాల భావమ్ము నీవు
కదలు పాదాల ఒరవడి నీవు
అందెల సవ్వడుల ప్రతిధ్వని నీవు
స్పందించు మువ్వల రవళి నీవు

గిరిజాత్మరూప కదలిరావమ్మ
వెలసి మా యెదల నిర్విఘ్నముగను
కవితలందుకొని నివేదనముగను
దీవించి, ఇచటనె నిలిచిపోవమ్మ.

# క్రైవల్యం

గరుడ వాహనమంపు నీ దరికి చేర
గురుడు నీవని నేను మదినమ్మితి గాన
నీ నామస్మరణమె ఒక పక్షమటయ్యా
నా పుణ్య కార్యములు సమముగా తూగ
ఎగసి వినువీధుల, వదలి ఈ బంధాల
అరసి నీ సన్నిధి సంతసించెదనయ్యా

మమతానురాగాల మది మథనమాయేను
సమత సాధింప వ్యథ ఇక వలదయ్యా
కన్నీటి సంకెలలు కలల సవ్వడులు
విడలేని వేదనలు, విరహాల రోదనలు
సమసిపోవగ, శాంతి జ్యోతి వెలిగించి
నీ వెలుగు సరసిలో కలువనై విరియన!!

# పాదపూజ

తెలివెలుగు రేకలో రేకువిప్పిన సుమము
తొలిపూజ కోసమై తరలివచ్చిన వేళ
పూల బాసల నెరుగని పూజారి కరముల
నలిగిపోయినదేమి? ఇదియేమి న్యాయము?

పాదపూజ యట, పసిమిరేకుల చీల్చి
ఛిన్నము చేసిన చిన్నారి పూవులను
ఎడత మోడుగ చేయు నిది యేమి పూజ
స్వామి, నీ పాదముల కరుణలేదేమి?

మందహాసము మెరయు మందార మొగ్గలు
మంచు తడిసిన చిన్నారి మల్లెలు
కన్నులర మోడ్చు సన్నజాజులు చేరి
పూజలందీయ, చిదిమి వేయుట ఏమి?

సృష్టికర్తవు, నీ దయాదృష్టి నెచట దాచేవు!
పూజ పేరిట పూవులనిటు ప్రోవుజేసి
చిదిమి చిదిమి నీ పాదాల నర్చించు
పూజారికిక ఎటుల పుణ్యములు గూడు??

# కమలము

దినకరు వెలుగుల విరిసెడు జలజను
మధుకర మురిపెము చవిగొను సుమమును
సరసున వెలసిన సుందర స్వప్నము
కలయని భ్రమపడు కనులకు విందును

తెలతెలవారగ తెరతును దళముల
మృదుతర శోభలు మెరయగ గళముల
పికముల రవములు జగతిని మొరయగ
శతదళ కుసుమము ఉనికిగ బడయగ

నెలతల కనులవి తామర రేకులు
ఉవిదల వదనము పద్మము బోలును
కవితకు నెలవగు మనికియె నాదని
జగతికి తెలియగ విరిసిన కమలను.

# మయూరము

మయూరిని వనమయూరిని నేను
మయూఖ తతులు ముసరగ ఆడేను
శ్రావణ మాసాన ఆకాశ మార్గాన
సాగేటి నీలిమల నెచ్చెలి నేను

శిఖి పింఛ మౌళికి సిగపూవు నేను
సిరి మెరుపు వెలుగులో పురివిప్పి ఆడేను
పర్జన్య స్వరజతుల నర్తించు పదగతులు
నెమలి నృత్యములు ప్రకృతికి హారతులు

పురుల తళుకులె కావ కృష్ణుని కనులు
నెమలి నడకలె కావ రాధమ్మ సొబగులు
యమున పిలచిన వేళ, మురళి పలికిన వేళ
రేపల్లె వాడలన్ని రాసలీలలె కావ!!

## విధి లీల!

తారల నడుమ వెలిగేటి రేరాజు నేను
క్షీర జలధి మథింప వెలసేను నేను
నీలి గగనము నేలు ఉడురాజు నేను
శూలపాణి జటలోని నెలవంక నేను

క్షీరాబ్ధి కన్యకకు అనుజుడ నేను
సుధల సోనలు చిలుకు సోముడ నేను
పూర్ణేందు బింబమై గగనాలు పయనించి
కలువ చెక్కిల మీటు శశాంకుడ నేను

సంపూర్ణ శోభలతో వెలుగొందు నాకు
విధాత తూలికతో గీసేను క్షీణతలు
పౌర్ణమి గడిచేను, దినదినము తరిగేను
అమవస నిశిలోన అంతమైపోయేను

కాని విడలేను ఆశల ఆలంబనలు
కొనగోటి రేఖగ విప్పేను కనులు
దినదినము ప్రవర్ధమానమై పెరిగేను
పున్నమి రేయికి పరిపూర్ణమగుదును

# రాజీ స్మృతికి

మిణుకు మిణుకుమనే మిణుగురు పురుగా
నేలకు జారిన తారువు నువ్వా
రెక్కల మాటున దాచిన మెరుపా
రెప్పల వాల్చిన తారక తళుకా?

బుడి బుడి నడకల ఉడతల్లారా
వడివడి పరుగుల బుడతల్లారా
జడిజడి వానలు తరిమేవేళా
పరుగిడి మోడుల దాగడమేలా?

రెపరెప రెక్కల చిలుకల్లారా
చిటిచిటి పలుకుల బాలల్లారా
ముసిముసి నవ్వుల అమ్మల చాటున
మోములు దాచెడు పిల్లల్లారా

ఫెళఫెళమని ఉరుమొస్తే
మా నాన్న వెనుక దాక్కుంటా
జలజలమని వానొస్తే
అమ్మ కొంగే గొడుగంట!

మెత్తని మబ్బుల పరుపుమీద
ఒత్తుగ చుక్కల్ని అద్ది
జాబిల్లిని నిద్రపుచ్చి
దోబూచులాడె బుజ్జి

కాకమ్మ తెచ్చింది కబురు నీ కోసం
అమ్మమ్మ పంపింది ఆ లోకపు తాయిలం
ఎక్కడికి పోలేదు నిన్నొదిలి ఇది నిజం
నీ చుట్టు పరచింది తన ప్రేమ వలయం

అఆ అంటూ ఆటలాడుదాం
ఇఈ అంటూ ఈతలు కొడదాం
ఉఊ అంటూ ఊయలలూగి
ఎఏ అంటూ ఎగిరి దూకుదాం
ఐ అంటే సైయ్యంటూ
ఒఓఔ లతో ఒప్పులకుప్ప
అంఅః అని అమ్మకి చెప్పి
పప్పు బెల్లం పంతులికిద్దాం
ఒకటి, రెండు, మూడు
స్నేహం చేసి చూడు
నాలుగు, ఐదు, ఆరు
నలుగురితో కలిసి ఆడు
ఏడు, ఎనిమిది, తొమ్మిది
లెక్కపెట్టి చూడు
పదిమంది మంచివాళ్లు
అవుతారు నీకు తోడు!!

చిన్నిచిన్ని పిల్లలకు చిట్టిపొట్టి పదాలు నేర్పిన ఉపాధ్యాయురాలిగా పిల్లల మనసుల్లో నిలిచిపోయిన 'రాజీ' చిన్న వయసులోనే చుక్కల మధ్య చోటు వెతుక్కుందని తెలిసినప్పుడు, స్నేహితురాళ్లందరికి చిన్న చెల్లెలితో సమానమైన 'రాజీ' స్మృతికి చిట్టి చిట్టి పలుకులే చిరు కానుకగా ఇవ్వాలని ఈ ప్రయత్నం.

# గేయ కథ

చిన్ని చిన్ని బాలలార!
చిన్నారి బాలులార!
కథ చెబుతా వినరండి
ఊం కొడుతూ వినరండి

అనగా అనగా ఒక ఊరు
అందమైన ఒక సెలయేరు
ఏటి గట్టున రెల్లుపూలు
ఏటిలోన గండుమీలు

కళ్ళు తెరిచిందొక చేపపిల్ల
కళ్ళలోన నీటి మిలమిల
ఏటికొచ్చిందొక చిన్న పిల్ల
నీటికోసమని ఆడపిల్ల

నీటముంచిన కడవలోన
కదలి ఆడిన చేపపిల్ల
వదలి పెట్టని వేడుకోగా
చెవిని పెట్టదు చిన్నపిల్ల

ఇసుక తిన్నెల ఆటలాడగ
మనసు పడెను చిన్నపిల్ల
కడవ పంపగ ఏటి ఒడ్డున
తల్లడిల్లెను చేపపిల్ల

‘నీరు వదిలిన బతకలేను
నిముషమైన నిలువలేను
నెలవు తప్పిన తిప్పలేను
నీటనే నా జీవితమ్ము”

బ్రతిమిలాడెను చేపపిల్ల
దయను బూనెను చిన్నపిల్ల
వదలి వేసెను నీటిలోన
కదలి ఆడెను చేపపిల్ల

నిజము మీరిది తెలుసుకొండి
నెలవు తప్పిన బతుకు కష్టమండి
ఎవరి చోటు వారిదండి
దారి తప్పి చింతించకండి.

# సంకీర్తనలు

పల్లవి: వందనము నీకు గణనాయకా
వందనము నీకు శుభదాయకా

అ.ప. తొలి పూజ నీకిదె వినాయకా
తొలి దైవము నీవె ఫలదాయకా

చ. కరిరాజ ముఖుడవు గిరితనయ సుతుడవు
కరములు జోడింప వరముల నొసగేవు
కావగ రావయ్యా కొలువగ పిలిచేము
బ్రోవగ వేచేవు కారణమేమయ్యా

చ. ముదమున చేసేము కుడుములు నీ కొరకు
ముదమార సేవింప కదలి రావయ్యా
హృదయాల నిలచి, మా బ్రతుకెల్ల తరియింప
శ్రీకరమగు శుభములు కలిగింప రావయ్యా!

# సంకీర్తనలు

పల్లవి: పన్నగేంద్ర శయన నను పాలింపరావె
విన్నపములాలించి కావగరావె

అ.ప. ప్రాణదాతవని పరిపరి నినువేడ
పాపము నశియింప ప్రార్థన వినవే

చ. యోగనిద్రలో నీవు సకలము మరచేవు
యోగీంద్ర నేనెవరి పాదాల వెదకేను?
శ్రీ సతినే మరచి, శయనింప బూనేవు
నేనెటుల నీ కరుణ కనగలనయ్యా

చ. తెలికనుల తెరచి నీవు జగమాలోకింప
వెలిగేను తిమిరాల దారుల దీపాలు
లోకముల శోకములు తొలగిపోవంగ
శ్రీకరమగు శుభములందీయ రావ!

# సంకీర్తనలు

పల్లవి: నిను నెర నమ్మితి దశరథ తనయా
ధరణిజ మనసును గెలిచిన విభుడా

అ.ప. రావణు దర్పము నణచిన ఘనుడా
ధారుణి శాంతిని నిలిపిన ప్రభుడా

చ. అవనిలో వెలసిన ధర్మపురాశిగ
కరుణతో శబరిని బ్రోచిన దాతగ
భరతుని త్యాగము కాచిన భ్రాతగ
చరితను నిలచిన ఇనకుల తిలకా

చ. పాపము, పుణ్యము ఎరుగని జీవుల
తాపము తొలిగెడు తారక నామము
శాపము నొందిన నాతిన కాచిన
శ్రీకర శుభకర మృదుతర నామము.

# సంకీర్తనలు

పల్లవి: శైలరాజ సుత నీవె శమము నీయవె
ఇలకొలుచు దాసుల బ్రోవగరావె

అ.ప. కరిరాజముఖుని కన్నతల్లి
సురసేన పతి(యైన) షణ్ముఖ జనని

చ. నటరాజ రమనీ లాస్య విలాసిని
నతలోక పాలిని నాట్యమయూరి
ప్రకృతియె రూపమైన పావని పార్వతి
పరమేశుడె కొలుచు అర్థనారీశ్వరి

చ. అసురుల దునిమిన చాముండేశ్వరి
అమరుల కాచిన రాజరాజేశ్వరి
జగముల బ్రోచేటి హే పరమేశ్వరి
శ్రీకరముగ శుభములందీవె ఈశ్వరి!

# సంకీర్తనలు

పల్లవి: రఘుకుల తిలక హే సాకేతరామ
ధరణిజ పాలక కారుణ్యధామ

అ.ప. ఇనకుల భూషణ శ్రీరామరామ
మునిజన పోషక క్షీరాబ్ధి సోమ

చ. కదలగా లేదయ్యా ఈ బ్రతుకు వాన
చుక్కాని నీవుగా తరియింపరావ
విడలేను చరణాల కరుణాలవాల
కరముల నందీర కౌసల్యాబాలక

చ. సీతమ్మ నెడబాసి కానల తిరుగాడ
తెలిసేన నా స్వామి కన్నీటి గాథ
ఇక చాలు నా తండ్రి ఇక తాళలేను
శ్రీకరమగు శుభములందీయరావ!

# సంకీర్తనలు

పల్లవి: మురుగా మురుగా యనగ మొరవినగ రావేల
ముద్దుమోముగల దేవ ఓ కార్తికేయ!

అ.ప. నడకలె నాట్యాలైన శిఖివాహన
కరుణయె కనుచూపై వెలిగేటి నాయక

చ. దేవసేనా ప్రణయ రాజ్యాల నేలి
శ్రీవల్లి సముఖాన రాజిల్లి, నిలచి
సురసేనా పతిగ తారకుని వధియించి
ఇల శాంతి నిలిపిన కైవల్య కీర్తి

చ. హే శంకరాత్మజ, హే గణేశానుజ
విశిష్ట దేవగణ సేనానాయక
పాహి ప్రభో మాం కరుణాలవాల
శ్రీకరమగు నీవు చిలికించు శుభములు!

# సంకీర్తనలు

పల్లవి: ప్రణవనాదము తానై పలికేను ప్రకృతి
ప్రణయగీతము తానై బదులాడె పరమేష్ఠి

అ.ప. హృదయ గానము తోడ నినదించె ఈ భువి
మృదుల రాగము తోడ కుసుమించె పృథివి

చ. సంధ్యదీపాలై వెలిగేను తారకలు
అంధకారాల తొలగించు దీపికలు
శంపాలతలుగ మెరసేన నగవులు
వింధ్య శిఖరుల సాగేటి నటనలు

చ. ఎలుగెత్తి పిలిచేను ఎలమావికోయిల
గళమెత్తి పలికేను చిరుగాలి బాలిక
శివమెత్తి ఆడేను పురుషోత్తముడే
శ్రీకరుడై శుభముల కలిగించు ఘనుడె.

# సంకీర్తనలు

పల్లవి: పంచభూతముల నేలు పరమాత్ముడితడు
సంచిదాగామియైన సర్మాత్ముడితడు

అ.ప. వేదవేదాంగుడట వేదాలభాష్యమట
ఉపనిషత్తుల సార సాకారరూపుడట

చ. అఖిల జగములకు మూలాధారము
సకల లోకములకు జీవాధారము
సాధుహృదయాలకు ప్రాణాధారము
చరాచర సహిత విశ్వాధారము

చ. అజ్ఞాన తిమిరాల ఛేదించు భాస్కరుడు
సుజ్ఞాన దీపముల వెలిగించు ఈశ్వరుడు
విజ్ఞానమే పంచి వినయమె సృజియించి
శ్రీకరుడై శుభముల కలిగించు ఘనుడు

# సంకీర్తనలు

పల్లవి: అరుదెంచెనదె చూడు అతివరొనేడు
అఖిల భువనాధారుడానంద నిలయుడు

అ.ప. అలనీలి మేఘుడట గగనాల రూపుడట
తెలికనుల వెలిగేటి ఎలనగవు రాశియట

చ. అభవుడా? అతడు, భవభయహరుడా
ఇభరాజును బ్రోచ ప్రభవించు విభుడా
సిరి అలగి తరలగా గిరి నిలచు శ్రీధరుడ
కరుణను జగమేలు నారాయణుడ!

చ. నందగోపని ఇంట నడయాడు బాలుడు
ఆల మందల కాచేటి నవనీత చోరుడ
తిరుమల పులకింప మునులెల్ల తరియింప
శ్రీకరుడై శుభముల కలిగించు ప్రభుడా!

# తలిరాకులు



డా॥ ఉమ శ్రీ సగరం కాశీపతి రావు శ్రీమతి వెంకట రమణమ్మల ఐదవ కుమార్తె. హైదరాబాద్ లోని మాడపాటి హనుమంతరావు బాలికల పాఠశాలలో హైస్కూల్ విద్యాభ్యాసం. ఉస్మానియా మెడికల్ కాలేజీలో యం.బి.బి.యస్. తరువాత ఇ.యన్.టి.లో యం.యస్.

భర్త డా॥ రామానుజం, U.S.A. లో ఫ్లొరిడాలో జనరల్ సర్జన్.
డా॥ ఉమ ENT Specialist

సంతానం : బి. శ్రీకర్, బి. స్వాతి

అమెరికాలోని కొన్ని ప్రతిష్టాత్మకమైన సేవా సంస్థలలో బాధ్యతా యుతమైన అనేక పదవులు నిర్వహిస్తూ సాంఘిక సేవలో పాలు పంచుకుంటున్నారు.

ముద్రిత రచనలు : 'తుహిన కణాలు' 'గాలిపల్లకి' మరియు 'శ్రీకరముల స్వాతి ముత్యాలు'

అమెరికాలో 'Authorhouse Publications'
English Novel ' I want my son back' A mother's cry